క్లుప్తంగా

6న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అనుమసముద్రంపేట: మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

ఆత్మకూరురూరల్: పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుడుముల సుధాకర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. పార్టీ పట్టణాధ్యక్షుడు కరటంపాటి సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులను పెంచాలి

వరికుంటపాడు: ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని వరికుంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కరిష్మా సూచించారు. వరికుంటపాడు పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు సురక్షితమని, గర్భిణులకు అవగాహన కల్పించి కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. ఈ నెల 17న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని 6 నెలల నుంచి 19 ఏళ్లలోపు కలిగిన బాలబాలికల జాబితాను రూపొందించాలన్నారు. సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజర్లు మేరీ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్సైకు సన్మానం



ఉదయగిరి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఏ శ్రీనివాసులును పలువురు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎస్సైగా పదోన్నతి పొందడంపై అభినందనలు తెలిపారు. న్యాయవాది రామారావు, స్థానికులు తులసీరామ్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించాలని వేడుకోలు

కొండాపురం: తన గ్రామానికి చెందిన కొందరి నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని నేకునాంపేట గ్రామానికి చెందిన ఎస్ రుక్మిణమ్మ పోలీసులను మంగళవారం వేడుకుంది. తన ఇంటి పక్కనే నివాసం ఉంటున్న కోటమ్మ, శివయ్య, పావని వారి ఇళ్లలోని మురుగు నీటిని తన ఇంటి ఎదురుగా పోస్తున్నారని తెలిపారు. అలా పోయవద్దన్నందుకు తనపై దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అధికార పార్టీ నాయకులు అండదండలతో వారు తనను బెదిరిస్తున్నారని వాపోయింది. పోలీసులు విచారణ చేపట్టి తనకు న్యాయం చేయాలని వేడుకుంది.

బాలచెన్నయ్య సేవలు మరువలేనివి



వింజమూరు(ఉదయగిరి): మండలంలోని చౌటపల్లి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన డీ బాలచెన్నయ్యను సహచర ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు కే వెంకటసుబ్బయ్య, జూపల్లి వెంకటేశ్వర్లు, పీ కొండారెడ్డి, ఏ చంద్రస్, శైలజ, డీ సుజాత, డీ చెంచయ్య, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన సూచించారు. స్థానిక సీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందితో మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజూ ఇంటింటికి వెళ్లి లార్వా, జ్వరపీడితుల సర్వే చేపట్టి నివేదిక ఇవ్వాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి వాటి బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. వైద్యసిబ్బంది వెంకటసుబ్బయ్య, నౌషాద్, భోగ్యం వెంకటేశ్వర్లు, చెన్నయ్య, అంకమ్మ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

కలిగిరి: ఎయిడ్స్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సార్స్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ రూత్‌బెనోమి అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో కలిగిరి పీహెచ్‌సీ, జిర్రావారిపాళెంలో ఎయిడ్స్, క్షయ వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష చూపరాదన్నారు. వారి వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. హెచ్‌ఐవీ నివారణ మందులను ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, సార్స్ సంస్థ సిబ్బంది సునంద, కవిత, ఝాన్సీ, అనిత పాల్గొన్నారు.

ముందుచూపేదీ?

దుస్థితిలో చెరువులు

- పూడికతో నిండిన పంట కాలువలు
- సమీపిస్తున్న రబీ సీజన్
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు



జమ్ముతో నిండిన మహిమలూరు చెరువు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఇరిగేషన్ సబ్‌డివిజన్ పరిధిలోని చెరువులు చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. చెరువు కట్టలు బలహీనంగా మారి భారీ వర్షాలు పడి నిండితే తెగిపోయే పరిస్థితిలో ఉన్నాయి. మరోవైపు కంపచెట్లు, జమ్ము దట్టంగా పెరిగి పంట కాలువలు పూడికతో నిండి అన్నదాతలకు తీవ్ర ఆవేదనను కలిగిస్తున్నాయి. రబీ సీజన్ సమీపిస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఆత్మకూరు ఇరిగేషన్ సబ్ డివిజన్ పరిధిలో ఆత్మకూరు నియోజకవర్గంలో 159 చెరువులు ఉన్నాయి. వాటి పరిధిలో 33 వేల ఎకరాల స్థిరీకరించిన ఆయకట్టు ఉంది. అలాగే ఉదయగిరి నియోజకవర్గంలోని ఉదయగిరి, సీతారామపురం, వరికుంటపాడు మండలాల పరిధిలో 72 చెరువులు ఉన్నాయి. గండిపాళెం మధ్య తరహా నీటి పారుదల ప్రాజెక్ట్ కూడా ఉంది. దీని పరిధిలో 16వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో ఇప్పటి వరకు చెరువుల్లో చుక్కనీరు లేదు. డివిజన్ పరిధిలోని పలు చెరువుల కట్టలు బలహీనంగా ఉండడం, తూములు దెబ్బతిని ఉన్నాయి. వచ్చే రెండు నెలల్లో భారీ వర్షాలు పడి చెరువులు నిండితే తెగిపోయే పరిస్థితి ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు చెరువుల్లో సాగునీరు చేరినా రైతులు పంటలు సాగు చేసుకునేందుకు అనువుగా సాగునీటి కాలువలు లేవు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు ఇప్పటి వరకు పంట కాలువల్లో పూడికతీతకు సంబంధించి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అన్నదాతలు తమ భవిష్యత్ వ్యవసాయ ప్రణాళికలపై ఆందోళనకు గురవుతున్నారు. ఆత్మకూరు ఇరిగేషన్ సబ్‌డివిజన్ పరిధిలో 231 చెరువుల కింద 47వేల ఎకరాల ఆయకట్టు ఉంది. వరుణ దేవుడు అనుకూలిస్తే 3 టీఎంసీల నీరు చెరువుల్లో నిల్వ చేరి అన్నదాతలు తమ భూముల్లో పంటలు సాగు చేసుకునేందుకు అవకాశం కలుగుతుంది. ప్రకృతి అనుకూలించకుంటే సారవంతమైన సాగు భూములు బీళ్లుగా మారే అవకాశం ఉంది. రబీ సీజన్‌లోగా ప్రభుత్వం స్పందించి చెరువు కట్టలను పటిష్ట పరచడంతో పాటు పంట కాలువల్లో పూడికతీతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



బసవరాజుపాళెం సమీపంలో జమ్ముతో నిండిన పంట కాలువ

పూడికతీత చేపట్టాలి



రబీ సీజన్ సమీపిస్తుండడంతో సాగుకు భూములు సిద్ధం చేసుకుంటున్నాం. ఇప్పటి వరకు వరుణుడు కరుణించక చెరువుల్లో నీరు చేరలేదు. సోమశిల ఉత్తర కాలువ ద్వారా సాగునీరు అందితే పంటలు సాగు చేసుకునే అవకాశం కలుగుతుంది. అయితే పంట కాలువలు పూడికతో నిండి ఉండడంతో సాగునీరు సక్రమంగా అందే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రభుత్వం ముందస్తుగా స్పందించి పంట కాలువల్లో పూడికతీతకు చర్యలు తీసుకోవాలి.

– ఇటుకల పెంచలయ్య, రైతు, మహిమలూరు

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంట కాలువల్లో పూడికతీతకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించే పనిలో ఉన్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా రానున్న రోజుల్లో వర్షాలు పడి చెరువుల్లో నీరు చేరితే సాగునీరు సవ్యంగా అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

–ఖాదర్ బాషా, ఏఈ, నీటి పారుదల శాఖ, ఆత్మకూరు

ఏఎస్‌పేటలో క్షుద్రపూజల కలకలం

- పోలీసుల అదుపులో నలుగురు వ్యక్తులు
- పోలీసు స్టేషన్ ఎదుట గ్రామస్తుల ఆందోళన



మహిళలతో మాట్లాడుతున్న సీఐ వేమారెడ్డి

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో మంగళవారం క్షుద్ర పూజల కలకలం రేగింది. అమావాస్య నేపథ్యంలో వారం రోజులుగా గండువారిపల్లి ప్రాంతానికి చెందిన రజియాబేగం, షాజహాన్ మరికొందరితో కలిసి తలుపులు వేసుకుని ఇంట్లోనే క్షుద్ర పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం వేకువజామున గంటల శబ్దం వినబడుతుండడంతో గ్రామస్తులకు అనుమానం వచ్చి తలుపులు తెరిచి చూశారు. ఇంట్లో గుంత తవ్వి చిన్న పాప, బాబును పెట్టుకుని పూజలు చేస్తుండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సైదులు ఘటనా స్థలానికి చేరుకోవడం గమనించి కొందరు పారిపోయారు. నలుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా ఇంటి పక్కనున్న పాఠశాలలో నిమ్మకాయలను పడవేయడం గమనించిన మహిళలు పెద్దసంఖ్యలో సాయంత్రం స్టేషన్ వద్దకు చేరుకున్నారు. క్షుద్ర పూజలు చేసిన వారిని శిక్షించాలంటూ ఆందోళన చేపట్టారు. స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు ఆత్మకూరు, సంగం సీఐలు వేణుగోపాల్, వేమారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మహిళలతో మాట్లాడి శాంతింపజేశారు. క్షుద్రపూజలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేశామని, కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మధ్యాహ్న భోజనంపై నిరంతర పర్యవేక్షణ



సీతారామపురంలో అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

ఉదయగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ప్రతి సోమ, గురువారాల్లో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు తప్పనిసరిగా పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని ఎంపీడీఓ ఈశ్వరమ్మ అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్లు తమ సచివాలయాల పరిధిలోని అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణ, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి యాప్‌ల్లో ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్ అయిన యువతీ యువకులకు ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పించి ఇంటర్, పదో తరగతి పరీక్షలు రాయించాలని కోరారు. ఎంఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

సీతారామపురం: ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు వారి పరిధిలోని పాఠశాలల్లోని మరుగుదొడ్లను పరిశీలించి ఐఎంఎంఎస్ యాప్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఎంఈఓ మస్తాన్‌వలి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎస్ఎంసీ చైర్మన్లకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ భార్గవి పాల్గొన్నారు.

సంగం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు జానకీరాం, మల్లయ్య, ఈఓపీఆర్డీ అప్పాజీ ఎస్ఎంసీ చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలలకు సంబంధించిన ఐఎంఎంఎస్ యాప్‌పై అవగాహన కల్పించారు.


మర్రిపాడు: మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎం, ఎస్ఎంసీ చైర్మన్లు, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లకు పాఠశాలల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ జ్యోతి, ఎంఈఓ–2 ధనలక్ష్మి మాట్లాడుతూ సోమ, గురువారాల్లో వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు, బుధ, శుక్రవారాల్లో ఎస్ఎంసీ సభ్యులు మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మండల రిసోర్స్‌పర్సన్ రాజేంద్రకుమార్, ఈఓఆర్డీ మస్తాన్‌ఖాన్, తదితరు పాల్గొన్నారు.

గిరిజనులకు ఆధార్ కార్డులు



ఆత్మకూరురూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజనులకు ఆధార్ కార్డుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని అప్పారావుపాళెం గిరిజన కాలనీలో మంగళవారం ఆయన పర్యటించారు. తొలుత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. నాణ్యతపై విద్యార్థులను ఆరాతీశారు. బోధన తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. అనంతరం గిరిజనులకు ఆధార్ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. గతంలో ఐటీడీఏ పంపిన జాబితాల ఆధారంగా జనన ధ్రువీకరణ పత్రాలు లేని వారిని గుర్తించి సర్టిఫికెట్లు అందజేస్తున్నామన్నారు. వాటి ఆధారంగా ఆధార్ కార్డులు నమోదుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజనులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందేందుకు తప్పనిసరిగా ఆధార్‌కార్డులు పొందాలని కోరారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

కలిగిరి: కేంద్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలిగిరి బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం ఆందోళన చేపట్టారు. సీపీఐ సీనియర్ నాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ నిత్యావసరాల ధరలను పెంచేస్తోందని ఆరోపించారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలు మూడు పూటలా తిండి తినలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలను తగ్గించకపోతే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సీపీఐ ఉదయగిరి నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి ఆనంద్, నాయకులు దుర్గాబాబు, రవికాంత్, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

- మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



ఆత్మీయ సమావేశంలో నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఎంతో అభిమానం ఉందని, పార్టీ నాయకులు, కార్యకర్తలను సార్వత్రిక ఎన్నికల ఫలితాలు కొంచెం నిరుత్సాహపరిచినా సమష్టిగా క్షేత్ర స్థాయిలో మళ్లీ పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు పట్టణ, రూరల్ నాయకులు, ప్రజాప్రతినిధులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు ఏమైనా అన్యాయాలు జరిగితే వారి తరఫున నిలబడి పోరాటం చేసేందుకు ప్రతిఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వ అక్రమాలపై ప్రశ్నించాలన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో చిరుద్యోగులను తొలగిస్తున్నారనే విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ఇసుక అక్రమ రవాణాతో బ్రిడ్జిలు దెబ్బతింటున్నాయని ప్రజాప్రతినిధులు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేలా అందరం సమష్టి కార్యాచరణను సిద్ధం చేసుకుందామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులు, నాయకులు స్పందించాలన్నారు. ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీకి తరగని ప్రజాదరణ ఉందని, ఆ ఆదరణ ఏ మాత్రం తగ్గకుండా ప్రస్తుత ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు ప్రతిఒక్కరికీ అందించేందుకు మన వంతు కృషి చేద్దామన్నారు. ప్రలోభాలకు గురికావాల్సిన అవసరం ఏ మాత్రం లేదని, సార్వత్రిక ఎన్నికల్లో 40 శాతం మంది ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరించారని గుర్తుచేశారు. కూటమి నాయకులు ఇబ్బందులకు గురిచేస్తే తన దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రజాక్షేత్రంలో ప్రజలతో మమేకమై ప్రతిఒక్కరికీ అండగా నిలుద్దామని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, మున్సిపల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పెంచలయ్య, కే స్వరూపరాణి, నోటి విజయజ్యోతి, గుడి సంధ్య, శివకోటారెడ్డి, షేక్ మహబూబ్‌బాషా, పట్టణ నాయకులు పూనూరు రమేష్‌రెడ్డి, వైస్ఎంపీపీ కంభంశెట్టి ప్రమీల, సానా వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

30శాతం సబ్సిడీపై మినుము విత్తనాలు

వరికుంటపాడు : ప్రభుత్వం 30 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలు అందజేస్తోందని ఏఓ రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్లాకు తెగులును తట్టుకుని అధిక దిగుబడినిచ్చే, పంటకోత దశలో ఒకటి రెండు వర్షాలకు తడిచినా గింజలు నేలరాలని, మొలకెత్తని లక్షణాలను కలిగిన మేలైన వీబీఎన్–8 రకం విత్తనాలను సరఫరా చేస్తోందని చెప్పారు. కిలో విత్తనాల ధర రూ.140 కాగా, 30 శాతం సబ్సిడీపై రూ.98కే అందజేస్తున్నట్లు చెప్పారు. నాలుగు కేజీల సంచి ధర రూ.392 కాగా, ఎకరాకు రెండు సంచుల చొప్పున ఒక రైతుకు గరిష్టంగా ఐదు ఎకరాల వరకు విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతుసేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

కలిగిరి: స్థానిక ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో గురువారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ దినేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిగిరి, కావలి, అల్లూరు సబ్ డివిజన్లకు సంబంధించి నిర్వహిస్తున్న ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు హాజరవుతారని చెప్పారు. వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

ఉదయగిరి: మండలంలోని 17 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైనట్లు ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ దీపాలు, రహదారుల మరమ్మతులు, తదితర వాటికి నిధులను ఖర్చు చేయవచ్చని వివరించారు.

బొగ్గేరు కాలువకు మరమ్మతులు చేపట్టాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు చెరువు కింద ఉన్న 6వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ఏడు కిలోమీటర్లకుపైగా ఉన్న బొగ్గేరు కాలువకు తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. మండలంలోని గొల్లపల్లి వద్ద ఉన్న బొగ్గేరు ఆనకట్టను మంగళవారం వారు క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్, ఆత్మకూరు మండల శాఖ అధ్యక్షుడు పాపిశెట్టి కృష్ణమోహన్ మాట్లాడుతూ గొల్లపల్లి వద్ద బొగ్గేరుపై బ్రిటీష్ హయాంలో నిర్మించిన ఆనకట్ట నుంచి ఆత్మకూరు చెరువుకు సాగునీటిని అందించే సహజ సిద్ధమైన కాలువ ముళ్లచెట్లు, జమ్ము, పూడికతో నిండిపోయి ఉందన్నారు. సోమశిల ఉత్తర కాలువ జలాలు సైతం ఇదే కాలువ నుంచి ఆత్మకూరు చెరువుకు చేరాల్సి ఉందన్నారు. మంత్రి ఆనం స్పందించి కాలువకు మరమ్మతులు చేయించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు నాయకులు జయరామయ్య, ప్రసాద్, వెంకటేశ్వర్లు, రమణయ్య పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ అమల్లోకి వచ్చిన సెప్టెంబరు 1వ తేదీ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చీకటి దినమన్నారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ జహీర్‌కు వినతి పత్రం అందజేశారు. ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, మర్రిపాడు మండలాల ఏపీటీఎఫ్ నాయకులు షబ్బీర్, ఓబులేసు, షేక్ ఖాజా, గౌస్, జిలానీ, మాధవరాజు, ఖాజాపీర్, మార్కండేయులు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



అల్లూరు: మండలంలోని గోగులపల్లిలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. 94 పాడి పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. రూ.20 వేల విలువైన మందులను పంపిణీ చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి టీ సోమయ్య, పశుసంవర్ధక శాఖ కావలి డీడీ రసూల్, పశువైద్యులు మహేశ్వరయ్య, గౌతమ్ పాల్గొన్నారు.

విజయవాడకు పారిశుధ్య కార్మికులు

వింజమూరు(ఉదయగిరి)/కలిగిరి: విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు వింజమూరు, కలిగిరి పంచాయతీలకు చెందిన పారిశుధ్య కార్మికులు మంగళవారం ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. వింజమూరు పంచాయతీ కార్యదర్శి బీ శ్రీనివాసులురెడ్డి, జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, కలిగిరి ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి, కలిగిరి పంచాయతీ కార్యదర్శులు చెంచుకృష్ణారెడ్డి, అశోక్ పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

బిట్రగుంట: బోగోలు మండలం అల్లిమడుగు సంగానికి చెందిన బచ్చు శంకర్ (34) సోమవారం రాత్రి పాము కాటుకు గురై మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. అల్లిమడుగు సంగానికి చెందిన బచ్చు శంకర్ రాత్రి పది గంటల సమయంలో ఇంటి బయట చాపపైన పడుకుని ఉండగా పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు బంధువుల సాయంతో ద్విచక్ర వాహనంపై హుటాహుటిన కోవూరుపల్లి పీహెచ్‌సీకి తరలించారు. పీహెచ్‌సీలో సరైన మందులు అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి కావలి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా అక్కడ చేరిన కొద్ది నిమిషాలకే మృతి చెందాడు. మృతుడి భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు బిట్రగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా కోవూరుపల్లి పీహెచ్‌సీ సిబ్బంది తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాముకాట్లు అధికంగా చోటు చేసుకునే వర్షాకాలంలో కూడా అత్యవసర మందులు అందుబాటులో లేకపోవడం, సిబ్బందిలో సత్వర స్పందన కనిపించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా ఆస్పత్రి సిబ్బంది వ్యవహారశైలిపై పలు ఆరోపణలు వచ్చాయి. సిబ్బంది వర్గాలుగా ఏర్పడి తరచూ ఫిర్యాదులతో వివాదాస్పద ఆస్పత్రిగా ముద్ర వేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రి పనితీరును మెరుగుపరచాలని గ్రామస్తులు కూడా విజ్ఞప్తి చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు మండలం గుండెమడకలకు చెందిన వేములపాటి మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మహేష్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంగళవారం పరామర్శించారు. కాకర్ల ట్రస్ట్ తరపున రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

వింజమూరు మండలం ఊటుకూరు ఎస్సీ కాలనీకి చెందిన శ్రీనివాసులు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందారు. శ్రీనివాసులు అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన ఎం నాగేశ్వరరావు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

‘వికసిత్ ఆంధ్ర’పై మెప్మా ఆర్పీలకు శిక్షణ



ఆర్పీలకు శిక్షణ ఇస్తున్న ఐబీ అంకయ్య

ఆత్మకూరు: మెప్మా ఐబీ అంకయ్య ఆధ్వర్యంలో మెప్మా ఆర్పీలకు వికసిత్ ఆంధ్రపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగులైన మహిళలు, పొదుపు మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగా నిరుద్యోగ యువతులను గుర్తించి నైపుణ్య శిక్షణను అందించి ఆయా రంగాల్లో ఉత్పత్తులు తయారు చేసేలా ప్రోత్సహించడంతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలు అందించేందుకు ఆర్పీలు కృషి చేయాలని కోరారు. మెప్మా సీఓ మాధవి, తదితరులు పాల్గొన్నారు.